క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మధిర: టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు మధిర డిపో కార్యాలయంలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.రామచంద్రరావు, అరుణకుమారి మాట్లాడుతూ.. 2013 వేతన సవరణలోని 50 శాతం బాండ్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. విభజించు, పాలించు అన్నట్లు కాకుండా డ్రైవర్, కండక్టర్లతో పాటు అన్ని కేటగిరీల వారికి ఒకేసారి నెల వారి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాగుల్‌మీరా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తల్లాడ: మండలంలోని బాలాపేట క్రాస్‌రోడ్డు వద్ద శనివారం మిసైన్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని చిన్నారుల చేత ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిట్టెం బ్రహ్మం, పాలెపు బ్రహ్మేశ్వరరావు, వడ్డాణపు నరేశ్, పడాల సైదులు, తొగరు గోవిందరావు, చిట్టెం రామారావు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సాధనకు పోరాడుతా



వైరాలో టీ కాస్తున్న జోగ్రామ్‌నాయక్

వైరా: పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా తనను గెలిపిస్తే గిరిజన హక్కులపై పార్లమెంట్‌లో పోరాడుతానని స్వతంత్ర అభ్యర్థి, హైకోర్టు న్యాయవాది, ఐక్యరాజ్య సమితి సభ్యులు తేజావత్ జోగ్రామ్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన వైరాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత 25 ఏండ్లుగా న్యాయవాదిగా సేవలందిస్తున్న తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై పోరాడుతానన్నారు. కేంద్రంలో పనిచేస్తున్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఇండియా బంజారా సేవా సమితి స్టేట్ జనరల్ సెక్రటరీ బిస్కినాయక్, బాణోత్ సునీల్, తేజానాయక్, సేనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కంతమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శ్రీకంతమహేశ్వర స్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గౌడ కులస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కంతమహేశ్వరస్వామి, సురమాంబకు బోనాలను సమర్పించారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కంచి రమేశ్ (52) శుక్రవారం రాత్రి మృతి చెందగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, మేదరి టోనీవీరప్రతాప్, ఎండీ యాకూబ్‌అలీ, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, మండెపూడి శ్రీనివాసరావు, పోలూరి రామారావు, బోడ మంగీలాల్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కల్లూరురూరల్: మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ చేపట్టిన ఓటు అవగాహన యాత్ర కార్యక్రమం శనివారం చెన్నూరుకు చేరింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించాలని సుధాకర్ కోరారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి ఓ వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. సదరు వ్యక్తి అదే గ్రామానికి చెందిన వివాహితతో శుక్రవారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

పన్నెండేళ్లుగా అసంపూర్తిగా..

- నిరుపయోగంగా స్త్రీ శక్తి భవనం
- అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు
- బీసీ వసతి గృహంలో కొనసాగుతున్న ఐకేపీ కార్యాలయం
- ఇబ్బందుల్లో పొదుపు సంఘాల సభ్యులు



చింతకానిలో నిరుపయోగంగా ఉన్న స్త్రీ శక్తి నూతన భవనం

చింతకాని: మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన స్త్రీ శక్తి భవనం నిరుపయోగంగా ఉంది. పొదుపు సంఘాల సభ్యుల అవసరాల కోసం నిర్మించ తలపెట్టిన స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు నిధుల కొరత వల్ల నిలిచిపోయి ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియడం లేదు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి నూతన స్త్రీ శక్తి భవన నిర్మాణానికి 12 ఏళ్ల కిందట శంకుస్థాపన చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద రూ.25 లక్షల వ్యయంతో స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో అంచనాలు పెరగగా.. సరిపడా నిధులు రాక పనులను నిలిపివేశారు. ఫలితంగా స్త్రీ శక్తి భవనం ప్రారంభం కూడా కాకముందే శిథిలావస్థకు చేరుకుంటోందని సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులపై శ్రద్ధ వహించాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవటం వల్ల భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందని మండల సమాఖ్య సభ్యులు ఆరోపిస్తున్నారు.

బీసీ వసతి గృహంలో..

చింతకాని ఇందిరా క్రాంతి పథం కార్యాలయం ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న బీసీ వసతి గృహంలో కొనసాగుతోంది. మండలవ్యాప్తంగా ఉన్న 1,294 పొదుపు సంఘాల్లో మొత్తం 13,102 మంది సభ్యులున్నారు. ఈ వసతి గృహం చింతకాని గ్రామ చివరన ఉండటంతో పొదుపు సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల సమాఖ్య సభ్యులు తెలిపారు. వసతి గృహంలో కార్యాలయానికి సంబంధించిన బీరువాలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి పెట్టడం వల్ల కార్యాలయంలో నిర్వహించే సమావేశాలు, సదస్సులకు ఇబ్బందికరంగా ఉంటోందని, నూతన భవనం మంజూరైనప్పటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని, నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండేవి కావని వాపోయారు. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ నిర్మాణ పనుల గురించి పట్టించుకోవటం లేదని మండల సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

పనులను ప్రారంభిస్తాం



మిగిలిపోయిన స్త్రీ శక్తి భవన నిర్మాణ పనుల కోసం అదనంగా మంజూరైన జెడ్పీ నిధులు రూ.5 లక్షలు రద్దు కావటంతో మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పనులను ప్రారంభించి త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. స్త్రీ శక్తి భవన నిర్మాణానికి ఇప్పటివరకు మంజూరైన నిధులు రూ.32 లక్షలకు పనులను పూర్తి చేశాం.

–సీహెచ్.రాంబాబు, ఇన్‌చార్జ్ ఏఈ, చింతకాని

త్వరగా పూర్తి చేయాలి



నిరుపయోగంగా ఉన్న స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. స్త్రీ శక్తి భవనం మంజూరైనప్పటికీ ఇబ్బందులు తప్పటం లేదు. భవన నిర్మాణ పనులను పూర్తి చేసి పొదుపు సంఘాల సభ్యుల ఇబ్బందులను తొలగించాలి. భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవటంతో బీసీ వసతి గృహంలో ఐకేపీ కార్యాలయాన్ని నిర్వహించటం ఇబ్బందిగా ఉంది.

–అరికొట్ల సుజాత, శ్రీచెన్నకేశవ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: ఖమ్మం పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని కేశ్వాపురం, ముద్దునూరు, కలకొడిమ గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని, నామ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. కుర్నవల్లిలో ఆదివారం సాయంత్రం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తదితర నాయకులతో కలిసి రోడ్ షో ఉంటుందని, పరిసర గ్రామాల నుంచి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వనిగండ్ల వెంకటేశ్వరరావు, చావా నరసింహారావు, నాగేశ్వరరావు, గుమ్మడి సాంబయ్య, రావూరి హనుమంతరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్



ఏన్కూరు: మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

ఏన్కూరు/కల్లూరు: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో కురుమ, యాదవులతో శనివారం సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెలు ఇస్తామని రెండేళ్ల డీడీలు కట్టించుకొని తరువాత చేతులెత్తేసిందని, దళితులను దళితబంధు పేరిట మోసం చేసిందని తెలిపారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వరదబోయిన నర్సింహారావు, అల్లాడి నర్సింహారావు, రేళ్ల శ్రీను, వరదబోయిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కల్లూరులోనూ కురుమ, యాదవులతో సమావేశం నిర్వహించి, రఘురాంరెడ్డిని గెలిపించాలని మల్లిబాబుయాదవ్ కోరారు. కార్యక్రమంలో ఎనుముల రుక్మిణి, ఎనుముల రాము, మార్తి వీరయ్య, మార్తి వెంకటేశ్వర్లు, పొదిలి వెంకటేశ్వర్లు, తోట సుబ్బారావు, గంగుల వెంకటేశ్వర్లు, శీలం వినోద్, మెట్టల ఉపేందర్, ఇమ్మడి రామనాథం, వీర్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తల్లాడలో బీజేపీ అభ్యర్థి రోడ్ షో

తల్లాడ: తల్లాడలో ఆదివారం సాయంత్రం ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు రోడ్ షో నిర్వహిస్తున్నట్లు బీజేపీ తల్లాడ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు



బోనకల్: ఓటు వేస్తున్న దివ్యాంగులు



ముదిగొండ: ఓటు వేస్తున్న వృద్ధుడు

బోనకల్: మండలవ్యాప్తంగా 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు శనివారం ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్ల పర్యవేక్షణలో మండలంలోని 94 మందికి గాను 85 మంది ఓటు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ ఎల్.రాజు, బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిగొండలో..

ముదిగొండ: మండలంలో వృద్ధులు, దివ్యాంగులు 65 మందికి గాను 61 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ రామారావు తెలిపారు. మండలంలోని చిరుమర్రి, పెద్దమండవ గ్రామాల్లో హోం ఓటింగ్‌ను శనివారం తహసీల్దార్ పరిశీలించారు. 17 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 44 మంది దివ్యాంగులు తమ ఇంటి వద్దే ఓటు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, నీటిపారుదలశాఖ డీఈఈ పెద్దరాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతకానిలో..

చింతకాని: మండలంలో వయోవృద్ధులు, దివ్యాంగులు 40 మంది శనివారం ఓటు వేశారు. మండలంలో 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు, దివ్యాంగులు కలిపి మొత్తం 83 మందిని గుర్తించగా రెండు టీంలు కలిపి రెండు రోజులు 79 మందిచే ఓటు వేయించారు. 83 మందిలో ఇద్దరు చనిపోగా ఇద్దరు అందుబాటులో లేరని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఎన్నెస్పీ డీఈ జక్కుల రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది

మధిర: విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యుత్ సంబంధిత ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే వాల్‌పోస్టర్లను మధిర విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.అనురాధ మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధిర టౌన్, రూరల్, ఎర్రుపాలెం, మాముసూరు సెక్షన్ల ఏఈలు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు, సబ్ ఇంజనీర్లు లావణ్య, ప్రవీణ్, చీనా, సిబ్బంది చెరుపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ దీక్షకు మద్దతుగా..

తల్లాడ: కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మంద కృష్ణమాదిగ హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా శనివారం తల్లాడ మండలం నుంచి ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లారు. మల్లవరం గ్రామం నుంచి బస్సు బయలుదేరగా గూడూరు, తదితర గ్రామాల ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు, అద్దంకి వెంకటేశ్వర్లు, మేడి సీతారాములు, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతర

ఏన్కూరు: మండలంలోని గంగులనాచారంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పెద్దమతల్లి జాతర శనివారంతో ముగిసింది. ఉదయం నుంచి ప్రజలు గ్రామదేవలకు జలాభిషేకం చేశారు. అనంతరం మేళతాళాల నడుమ బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మతల్లికి సమర్పించారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా చల్లగుళ్ల



నర్సింహారావు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా చల్లగుళ్ల నర్సింహారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమాచారం ఇవ్వాలి

ముదిగొండ: గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్‌ఐ నరేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళ్లేటప్పుడు చుట్టుపక్కల వారితోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే వారి ఫొటోలు తీసి పోలీసులకు పంపించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం



ప్రచారం చేస్తున్న పలు పార్టీల నాయకులు

వైరా: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కార్యకర్తలు శనివారం వైరాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 6 నుంచి వైరా మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కూరగాయల మార్కెట్, ప్రధాన దుకాణ సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాల్‌రావు, ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు, కట్ల సంతోష్, నాగరాజు, దొడ్డా పుల్లయ్య, దార్న రాజశేఖర్, మచ్చా బుజ్జి, బీడీకే రత్నం, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, సుంకర సుధాకర్, బొంతు సమత, షేక్ షరీఫ్ (మైక్ బాబు), కొండా రామకృష్ణ పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శనివారం రాత్రి మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు సుధాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బండారు నర్సింహారావు, శీలం అక్కిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, జంగా పుల్లారెడ్డి, దేవరకొండ రాజీవ్‌గాంధీ, వేమిరెడ్డి వెంకటరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, అయిలూరి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో..

చింతకాని: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, మడుపల్లి గోపాలరావు, అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, కిలారు మనోహర్‌బాబు, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, దూసరి గోపాల్‌రావు, రాసాల మోహన్‌రావు, కూచిపూడి రవి, వత్సవాయి జానకీరాములు పాల్గొన్నారు.

గాలిదుమారం బీభత్సం



పెనుబల్లి: రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వృక్షం



సత్తుపల్లిటౌన్: విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

పెనుబల్లి: మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం భారీ గాలిదుమ్ముతో కూడిన వడగండ్ల వర్షం పడింది. గాలిదుమారానికి ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. విద్యుత్ తీగలపై భారీ వృక్షాలు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలిదుమ్ము తీవ్రతకు పెద్ద పెద్ద వృక్షాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. గాలిదుమ్ముతో తాటాకు ఇండ్లు, రేకుల ఇండ్లపై ఉన్న పైకప్పులు ఎగిరిపోయాయి. దీంతో రేకుల ఇండ్లలో ఉంటున్న పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో శనివారం గాలిదుమారం బీభత్సం సృష్టించింది. ఫ్లెక్సీలు, చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం పడటంతో ఉపశమనం పొందారు.

చింతకానిలో చిరుజల్లులు

చింతకాని: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: వచ్చేనెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ సూచించారు. సత్తుపల్లి కోర్టులో శనివారం నిర్వహించిన పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత మేర ఎక్కువ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం అందుతుందని కక్షిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మీరా ఖాసీం సాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరు ఆదయ్య, ఏసీపీ రఘు, సీఐ కిరణ్, ఎస్‌ఐలు వెంకటేశ్, ప్రసాద్, ఏపీపీలు రాజారావు, భాష, ప్రదీప్, ఏఓ బోయినపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో వెంగళరావు జయంతి



కల్లూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: మాజీ ముఖ్యమంత్రి దివంగత జలగం వెంగళరావు జయంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, గోలి శ్రీనివాసరెడ్డి, శివవేణు పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు: కల్లూరులో శనివారం మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఆర్యవైశ్య సంగం రాష్ట్ర నాయకులు పసుమర్తి చందర్‌రావు మాట్లాడారు. బాగం ప్రభాకర్‌రావు, మాదిరాజు అన్నంరాజు, యాసా శ్రీకాంత్, భూక్యా శివకుమార్‌నాయక్, ఎనుముల రాము, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మేకల సాంబశివరావు, పరిమి భరత్, జినుగు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి కళాశాలలో ప్రతిభ పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. సాయిస్ఫూర్తి స్టూడెంట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన పరీక్షకు జిల్లాతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల నుంచి 350 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి సాయిస్ఫూర్తి మెరిట్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఇంజనీరింగ్ విద్య అందిస్తామని చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి కూలీకి గాయాలు

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న గూడ కవిత ట్రాక్టర్ పైనుంచి జారిపడి గాయపడింది. శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. ఉపాధి పనుల్లో భాగంగా ట్రాక్టర్‌లో నింపిన చెరువు మట్టిని అన్‌లోడింగ్ చేస్తున్న కవిత ట్రాక్టర్ పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడింది. దీంతో ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కూలీలు ఆమెను కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు చెయ్యి విరిగినట్లు నిర్ధారించారు. వెంటనే కవితను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.